అదానీతో రేవంత్ మిలాఖత్

కాంగ్రెస్ అధిష్ఠానం కుస్తీ.. సీఎం దోస్తీ

- రాష్ట్రంలో భారీగా అదానీ పెట్టుబడులు
- సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు
- దావోస్‌లోనే ప్రభుత్వంతో అదానీ ఒప్పందం
- స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల విరాళం

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిత్యం అదానీకి వ్యతిరేకంగా పోరాడుతుంటే రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం అదానీతో దోస్తీ చేస్తున్నది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన అదానీ గ్రూపు ఇటీవలే ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీకి రూ. 100 కోట్ల విరాళం ఇచ్చింది. సిమెంట్ పరిశ్రమలో గుత్తాధిపత్యం కోసం ప్రయత్నిస్తున్న అదానీ గ్రూప్ అందులో భాగంగా రాష్ట్రంలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. రాష్ట్రంలో విద్యుత్తు, సిమెంట్, డాటా సెంటర్లు తదితర రంగాల్లో రూ. 12,400 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు సందర్భంగా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. డాటా సెంటర్ ఏర్పాటుకు రూ. 5,000 కోట్లు, గ్రీన్ ఎనర్జీకి సంబంధించి రెండు పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు (పీఎస్‌పీ)ల ఏర్పాటుకు రూ. 5,000 కోట్లు, రక్షణ రంగంలో ఆర్‌అండ్‌డీ ఎకోసిస్టం ఏర్పాటుకు రూ. 1000 కోట్లు, సిమెంట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 1400 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నగూడెంలో 70 ఎకరాల్లో వచ్చే ఐదేండ్లలో ఏడాదికి 6 మిలియన్ టన్నుల సామర్థ్యంతో సిమెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అదానీ గ్రూపునకు సంబంధించిన అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమకు సంబంధించి ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. అయితే, సిమెంట్ కంపెనీతో తమ జీవితాలు బుగ్గిపాలవుతాయని, ఎట్టి పరిస్థితిలో సిమెంట్ పరిశ్రమను అనుమతించేది లేదని స్థానికులు ఆందోళన చేపట్టారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ స్థానిక అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సిమెంట్ పరిశ్రమల ఏర్పాటులో దూకుడుగా వ్యవహరిస్తున్న అదానీ గ్రూప్ ఇప్పటికే ఏటా 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అల్ట్రాటెక్ తరువాత దేశంలోనే రెండో అతిపెద్ద సిమెంట్ ఉత్పత్తిదారుగా ఎదిగింది. రాష్ట్రంలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు ద్వారా కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరగనున్నది.

అదానీకి ప్రభుత్వం రెడ్‌కార్పెట్

రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ వ్యవస్థను అదానీ గ్రూప్‌కు ప్రభుత్వం అప్పగిస్తున్నట్టు వార్తలు వెలువడడం, ఇటీవలే పాతబస్తీ ప్రాంతంలో ఆ గ్రూప్‌కు చెందిన కొందరు సిబ్బంది ఇండ్లలో కరెంటు మీటర్ల వివరాలు సేకరించడంతో స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది మరువకముందే సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు సన్నాహాలు మొదలు కావడం గమనార్హం. క్రమంగా రాష్ట్రంలో అదానీ వ్యాపార కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎర్రతివాచీ పరుస్తున్నట్టు స్పష్టమవుతున్నది. పరిశ్రమల ఏర్పాటు వల్ల ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలు నిత్యం విమర్శలు గుప్పించే కంపెనీతోనే రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తున్నది. గౌతమ్ ఫౌండేషన్ తరపున గౌతమ్ అదానీ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి స్కిల్ యూనివర్సిటీకి రూ. 100 కోట్ల విరాళం ఇచ్చారు. ఒక కంపెనీ ప్రభుత్వానికి ఇంత భారీస్థాయిలో విరాళం ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వ్యాపార కార్యకలాపాలు మొదలు కాకముందే రూ. 100 కోట్లు విరాళం ఇవ్వడంపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

దావోస్‌లో అదానీ గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

నోరు మెదపని రాహుల్‌గాంధీ

మోదీ ప్రభుత్వం ప్రజల సొమ్మును అదానీ గ్రూప్‌కు దోచిపెడుతున్నదని పదే పదే విమర్శిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ రాష్ట్రంలో అదానీ వ్యాపారాలపై మాత్రం నోరు మెదపడంలేదు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పెద్దలు అదానీని వ్యతిరేకిస్తుంటే, రాష్ట్రంలో మాత్రం ఆ పార్టీ ప్రభుత్వం వారితో దోస్తీ చేస్తుండడం గమనార్హం. కేంద్రంలోని బీజేపీ సర్కారు సైతం తెలంగాణలో అదానీ పెట్టుబడులకు తమవంతు సహకారం అందిస్తున్నదని, దీన్నిబట్టి కాంగ్రెస్, బీజేపీలు కలిసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని స్పష్టమవుతున్నదని బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది.

ఆది, అంతం.. మూసీ మోసం!

- హైదరాబాద్‌లో సుందరీకరణ.. యాదాద్రిలో కాలుష్యీకరణ
- రామన్నపేటలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు చర్యలు
- 2 లక్షల మందిపై తీవ్రప్రభావం
- వ్యవసాయ భూములు, జంతు, వృక్ష జాతులపైనా ఎఫెక్ట్
- పరిశ్రమ మధ్యలోంచే మూసీ ధర్మారెడ్డిపల్లి కాలువ
- వ్యతిరేకిస్తున్న స్థానికులు

(పున్న శ్రీకాంత్)

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఆహ్లాదకర ప్రశాంత వాతావరణం.. చుట్టూ చెరువులు.. పచ్చని పొలాలు.. నేటికీ కుల వృత్తులతో ఉపాధి.. ఆరోగ్యవంతమైన జీవనం.. బడుగు బలహీన వర్గాల పేదలు.. ఇదీ యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట పరిసర ప్రాంతాలవాసుల జీవన గమనం. కానీ మరికొన్ని రోజుల్లో ఈ ప్రాంతం కాలకూట విషంగా మారబోతున్నది. ఇక్కడి ప్రజలపై అదానీ పిడుగు పడింది. అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ కంపెనీతో నాలుగు మండలాల్లోని పలు గ్రామాలపై ప్రభావం పడనున్నది. సుమారు రెండు లక్షల మంది ప్రజల జీవితాలు తారుమారు కానున్నాయి. ఓ వైపు మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవం అంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఊదరగొడుతున్నారు. మరోవైపు మూసీ ఒడ్డున కాలుష్య కారక కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నారు. నిన్న దామగుండం అంతర్జానికి అడుగులు వేయగా, నేడు మూసీని ఆగం చేసే కుట్రకు పూనుకున్నారు. ఇప్పటికే ఆగమైన మూసీ కాలువలను మరింత మురికి కూపంగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. మూసీలో భాగమైన ధర్మారెడ్డిపల్లి కాలువ, పిలాయిపల్లి కాలువలు వ్యర్థ రసాయనాలతో కాలుష్య కాసారంగా మిగిలిపోనున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయి గూడెం, సిరిపురం గ్రామాల పరిధిలో అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని సదరు సంస్థ నిర్ణయించింది. 65.5 ఎకరాల్లో కంపెనీ స్థాపనకు చర్యలు తీసుకుంది. స్టాండ్ అలోన్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌లో ఏటా 6.0 ఎంఎంటీపీఏ సిమెంట్ ఉత్పత్తికి ప్రతిపాదనలు చేశారు. ప్రాజెక్ట్ వ్యయం రూ. రూ.1400 కోట్లు కాగా, రెండు దశల్లో నిర్మించనున్నారు. మొదటి దశలో రూ. 700 కోట్లు, రెండో దశలో రూ. 700 కోట్లు ఖర్చు చేయనున్నారు.

రామన్నపేటలో సాగు చేసిన వరి పంట పొలాలు

డ్రైపోర్టు, లాజిస్టిక్ పార్కు పేరుతో భూములు కొని..

గతంలో రామన్నపేటలో డ్రైపోర్టు, లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తామని కొమ్మాయిగూడెం, రామన్నపేట, సిరిపురం ప్రాంత రైతుల నుంచి 350 ఎకరాలను అదానీ గ్రూపు కొనుగోలు చేసింది. ప్రజలు, పొలాలకు ఎలాంటి కాలుష్యం లేని ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఉద్యోగావకాశాలు వస్తాయనే ఆశతో రైతులు భూములు అమ్మారు. అదానీ కొనుగోలు చేసిన భూములన్నీ పంట పొలాలే. కానీ నేడు అదే కంపెనీ కొత్తగా అంబుజా సిమెంట్ కంపెనీతో పేరుతో రైతులను నట్టేట ముంచే కార్యక్రమానికి సిద్ధపడుతున్నది.

2 లక్షల మందిపై ఎఫెక్ట్

రామన్నపేట మండల కేంద్రానికి 500 మీటర్ల దూరంలోనే ప్రతిపాదన సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రామన్నపేట మండలంలో 24 గ్రామాలు ఉన్నాయి. దీనితోపాటు వలిగొండ, చిట్యాల, నార్కట్‌పల్లిలోని పలు మండలాల్లోని 2 లక్షల మంది ప్రజలపై సిమెంట్ కంపెనీ ప్రభావం పడనుంది. ముఖ్యంగా అతి సమీపంలో ఉన్న కొమ్మాయిగూడెం, రామన్నపేట, సిరిపురం, వెల్లంకి, బోగారం, తుమ్మలగూడెం, నీర్మెముల, నిదాన్‌పల్లి, జనంపల్లి, ఇస్కిల్ల, పెద్దకాపర్తి గ్రామాలు ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుతం ఎలాంటి రోగాలు లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నారు. కంపెనీ ఏర్పాటైతే అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

కాలుష్య కాసారం.. అనారోగ్య జీవనం

అదానీ సిమెంట్ కంపెనీ ఏర్పడితే పర్యావరణం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో జీవకోటి మనుగడకు ముప్పు వాటిల్ల నుంది. సిమెంట్ పరిశ్రమ ద్వారా ఎగిసిపడే దుమ్ము, ధూళితో వాయు, శబ్ద, జల కాలుష్యం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ దగ్గరలో ముడి సరుకు అందుబాటులో లేవు. దీంతో పెద్ద ఎత్తున తెప్పించాల్సి ఉంటుంది. భారీ వాహనాల రాకపోకల కారణంగా శబ్దాల స్థాయి పెరుగుతుంది. సిమెంట్‌లో కలిపే రసాయనాల మూలంగా ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం లేకపోలేదు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ రసాయనాలైన జిప్సం, స్లాగ్, క్లింకర్, బొగ్గు, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ గాల్లో కలవడంతో ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయి. చర్మ రోగాలు, గర్భస్రావాలు, చిన్న పిల్లల్లో ఎదుగుదల లోపించడం, కంటి చూపు మందగించడం, దివ్యాంగత్వం వంటివి వచ్చే చాన్స్ ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో భూమి బూడిద, పసుపు, ముదురు గోధుమ రంగులోకి మారే ప్రమాదం ఉంది. దీంతో పంటలు పండక, దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతారు.

తప్పులతడకగా 'అదానీ' నివేదిక

సిమెంట్ కంపెనీ సంబంధిత ప్రాంతాల్లో అధ్యయం చేసింది. ఈ మేరకు ఓ నివేదికను విడుదల చేసింది. అందులో అన్నీ తప్పుల తడకగా పలు అంశాలను రూపొందించింది. ఈ ప్రాంతం పూర్తిగా వెనకబడిన ఏరియాగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. ఇక్కడ ఉన్న పెద్ద సంస్థలను కనీసం పొందుపర్చలేదు. ప్రతిపాదిత ప్రాంతం కూతవేటు దూరంలో ప్రభుత్వ ఏరియా దవాఖాన, డిగ్రీ కాలేజీ ఉన్నా ఎక్కడా ప్రస్తావించలేదు. ఇక్కడి ప్రాంత ప్రజలు ఇంకా చేతి పంపు నీరు తాగుతున్నారని, 24 గంటల కరెంట్ సరఫరా ఉండదని చెప్పుకొచ్చింది. పరిశ్రమ వస్తేనే ఆయా ప్రాంతాలు బాగుపడుతాయన్నట్టుగా పేర్కొంది. పరిశ్రమలో భాగంగా స్థానికులకు విద్యార్హతలను బట్టి ఉపాధి కల్పిస్తామని, అది కూడా తొలి దశలో 90 మందికి మాత్రమే ఇస్తామని తెలపడం గమనార్హం.

మూసీ కాలువలకు ముప్పు

సిమెంట్ పరిశ్రమతో మూసీలో భాగమైన ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాలువలు పూర్తిగా మురికి కూపంగా మారనున్నాయి. మూసీ నీరు వలిగొండ మండలం గోకారం చెరువులోకి చేరుతుంది. అక్కడి నుంచి ఆసిఫ్‌నగర్ కాలువ, ధర్మారెడ్డి పల్లి కాలువలు వేరుగా ప్రవహిస్తాయి. ఇక్కడ సిమెంట్ పరిశ్రమ మధ్యలో నుంచే ధర్మారెడ్డిపల్లి కాలువ వెళ్తున్నది. ఆ కంపెనీకి ఇదే కలిసివచ్చే అంశం. ఈ ఫ్యాక్టరీకి రోజుకు లక్ష లీటర్ల నీళ్లు అవసరం. ఈ కాలువ ద్వారా రోజుకు 3 లక్షల నీళ్లు అందుతాయి. మిగతా నీళ్లు రామన్నపేట మండలంలోని గ్రామాల నుంచి తీసుకునే ప్రణాళిక రూపొందించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు ఫ్యాక్టరీ వ్యర్థాలు ఎక్కడ వదులుతారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ధర్మారెడ్డిపల్లి నీటిని ఉపయోగించుకోవడంతోపాటు, వ్యర్థాలను అందులోనే వదులుతారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కాలువ సిమెంట్ ఫ్యాక్టరీ ఉన్న చోట నుంచి మరో 16 గ్రామాల వరకు పారుతుంది. ఇది చిట్యాల మండలం లింగోటం వద్ద ముగుస్తుంది. ఆయా గ్రామాలన్నీ ఈ కాలువపై ఆధారపడి ఉన్నాయి. ఈ వ్యర్థాలన్నీ ఆయా గ్రామాలకు తాకి నష్టం చేకూర్చనున్నాయి. పిలాయిపల్లి, కాళేశ్వరం కాలువలు సమీపం నుంచే పారుతున్నాయని, ఇవి కూడా కాలుష్యంగా మారే ప్రమాదం ఉందని ఈ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే 'మూసీ'తో ఆగమాగం..

హైదరాబాద్ మహానగర డ్రైనేజీ వాటర్‌తో మూసీ కలుషితమైంది. కొత్తగా అంబుజా సిమెంట్ పరిశ్రమ తోడైతే జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. మూసీ అంటేనే ముక్కుపుటాలదిరే దుర్గంధం. ఈ ప్రాంతాల్లో కాలుష్యపు నీటి కారణంగా వరిపంట దిగబడి తగ్గిపోయింది. పండిన పంట సైతం రంగు మారి, తాలు రూపంలో బరువు తక్కువగా ఉంటున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పండించిన పంటకు సైతం సరైన గిట్టుబాటు ధర లేదు. ఇక్కడ పంటను ఎవరూ కూడా తినరు. మూసీ పరీవాహక ప్రాంతం చేపలను ముట్టుకోవడానికే భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చర్యలు ఇక్కడి ప్రజలను భయపెడుతున్నది.

'అదానీ'పై ప్రజల తిరుగుబాటు

రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేయనివ్వబోమని ఘంటాపథంగా చెప్తున్నారు. అన్ని పార్టీల నేతలు ఒక్కతాటిపైకి వచ్చారు. అంతా కలిసి పర్యావరణ పరిరక్షణ వేదికను ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలోనే ఉద్యమ బాట పట్టారు. రోజువారీ కార్యక్రమాలు చేపడుతున్నారు. మేధావులతో సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. తాజాగా పరిశ్రమను వ్యతిరేకిస్తూ ఈమెయిల్ ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక చేస్తున్నారు.

23న ప్రజాభిప్రాయ సేకరణ

రామన్నపేటలో అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై 23న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రకటన చేశారు. కలెక్టర్ లేదా జేసీ సమక్షంలో ప్రజల అభిప్రాయాలు తీసుకోనున్నారు. జనం నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో భారీ బందోబస్తు మధ్య అభిప్రాయాలను తీసుకోనున్నట్టు తెలుస్తున్నది.

ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటం

మేం ప్రశాంతంగా జీవిస్తున్నం. ఊరికి 500 మీటర్ల దూరంలోనే సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామంటే ఊరుకుంటామా? నాడు అదానీ కంపెనోళ్లు మోసం చేసి ఆ భూములను కొన్నరు. లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తామంటే వ్యవసాయ భూములు ఇచ్చాం. ఇప్పుడు అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని వస్తున్నరు. దామరచర్ల పోయి సిమెంట్ కంపెనీలను చూసొచ్చినం. ఎడారిగా మారడం ఒక్కటే మిగిలింది. ఎట్టి పరిస్థితుల్లో పరిశ్రమ పెట్టనీయం.

-మహమ్మద్ రెహాన్, పర్యావరణ పరిరక్షణ వేదిక కోకన్వీనర్

పరిశ్రమ పేరెత్తితే తరిమికొడ్తం

సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణ అంటడు. మరి మా దగ్గర ఎందుకు కాలుష్యీకరణ? మూసీలో భాగమైన ధర్మారెడ్డిపల్లి కాలువ పరిశ్రమ మధ్యలోంచే పోతున్నది. పరిశ్రమ వ్యర్థాలన్నీ కాలువలోకి వదలడానికా? పరిశ్రమతో రెండు లక్షమందిపై ప్రభావం పడుతుంది. అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. పరిశ్రమ పేరెత్తితే తరిమికొట్టుడే. రామన్నపేటలో పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు.

- పోశబోయిన మల్లేశం, పర్యావరణ పరిరక్షణ వేదిక

రామన్నపేటలో మూసీ నీరు పారే ధర్మారెడ్డి కాలువను చూపిస్తున్న స్థానిక నాయకులు

నిన్న దామగుండం.. నేడు రామన్నపేట

కాంగ్రెస్ సర్కారు మూసీ సుందరీకరణ అంటూనే మూసీని ఆనవాళ్లు లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నది. ఇటీవల మూసీ జన్మస్థలం అయిన వికారాబాద్ అడవుల్లో నేవీ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసింది. దీంతో అడవికి ముప్పు వాటిల్లుతుందని, మూసీ అంతర్ధానమవుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంతమైన రామన్నపేటను మరింత మురికి కూపంగా, కాలుష్య కాసారంగా చేసే కుట్ర చేస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.

నవంబర్ 23న ధర్మాగ్రహ దీక్ష: తపస్

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): పెండింగ్ డీఏలను విడుదల చేయకపోవడం, పీఆర్సీని ప్రకటించకపోవడం, పెండింగ్ బిల్లులను మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ నవంబర్ 23న చలో ఇందిరాపార్క్‌కు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) పిలుపునిచ్చింది. ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షను తలపెట్టినట్టు తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత రావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ తెలిపారు. తపస్ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. అక్టోబర్, నవంబర్ మాసాల్లో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు కార్యాచరణను ప్రకటించారు. 22న పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, 29న ఎమ్మార్వో ఆఫీసుల వద్ద నిరసన, నవంబర్ 5న కలెక్టరేట్ల వద్ద ధర్నా, 23న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షను నిర్వహించాలని తీర్మానించారు. రాష్ట్ర సహాధ్యక్షులు అయిలేనేని నరేందర్ రావు, అల్లుపల్లి పాపిరెడ్డి, బెండి ఉష, అదనపు ప్రధాన కార్యదర్శివర్గం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గ్రామ పంచాయతీలను గ్రేడ్-1,2,3,4 కింద పునర్‌వ్యవస్థీకరించి కార్యదర్శుల రెగ్యులరైజేషన్ కాలాన్ని రెండేండ్లకు కుదించాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. కౌంట్‌సోర్సింగ్ నియామకాలను రద్దుచేసి ప్రస్తుతం పనిచేస్తున్న ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చాలని, జీవో-317 ద్వారా నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులను తిరిగి సొంత జిల్లాలకు పంపాలని, పంచాయతీ కార్యదర్శుల చట్టంలో సవరణలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతు బిడ్డకు నాలుగు కొలువులు

- గతంలో జేపీఎస్, కోర్టుల్లో ..
- తాజాగా సింగరేణి జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్‌గా ఎంపికైన మధు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన పరిస్థితుల్లో అతడు ఏకంగా నాలుగు కొలువులు కొల్లగొట్టాడు. జనగామ జిల్లా రఘునాథపాలెం మండలం కంచనపల్లికి చెందిన కౌడగాని మైసారావు-వినోద రైతు దంపతుల చిన్నకొడుకు మధు ఒకటి నుంచి పదో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. 2009లో టెన్త్‌లో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. 2012లో హైదరాబాద్ రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమా పూర్తి చేశాడు. 2012లో లాసెట్ రాసి స్టేట్ లెవల్‌లో సెకండ్ ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో ఎల్ఎల్‌బీ చదివాడు. ప్రభుత్వ పోటీ పరీక్షలకు ప్రిపరేషన్‌కు ఉపక్రమించాడు. 2019లో పంచాయతీ కార్యదర్శిగా తొలి ఉద్యోగం పొందాడు. 2023లో జనగామ కోర్టులో జేఏగా, 2024లో హైకోర్టులో ఎగ్జామినర్‌గా ఎంపికయ్యాడు. జూలై 20న సింగరేణి నిర్వహించిన జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్ష రాశాడు. ఈ నెల 18న ఫలితాలు విడుదల చేయగా సెలెక్ట్ అయ్యాడు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తల్లిదండ్రులు, సోదరుడి ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించానని చెప్పాడు.

కోమటిరెడ్డి ఖబడ్దార్!

- మూసీకన్నా అధ్వాన్నం నీ నోరు
- జగదీశ్‌రెడ్డి కాలిగోటికి సరిపోవు
- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- మంత్రిది కుసంస్కారం: రవీంద్ర
- ప్రజల్లో విషం నింపుతున్నరు: పైళ్ల
- అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?:పల్లె

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): 'ఖబడ్దార్.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో' అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. వెంకట్‌రెడ్డి నోరు మూసీ కన్నా అధ్వానంగా మారిందని విమర్శించారు. 'తాగి ఏం మాట్లాడుతవో, ఏం చేస్తవో తెలియదు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కాలిగోటికి సరిపోవు. నీ స్వగ్రామం బ్రాహ్మణవెల్లెంలలో రూ.5 కోట్ల విలువైన సబ్‌స్టేషన్ సామగ్రిని అమ్ముకొన్నది నువ్వు, నీ అనుచరులు కాదా?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిపై మంత్రి వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. కోమటిరెడ్డి సోదరులు నల్లగొండ జిల్లాకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. మంత్రి పదవి కాపాడుకోవడానికే రేవంత్‌రెడ్డి భజన చేస్తున్నారని మండిపడ్డారు. నాగార్జున సాగర్ నీళ్లు ఖమ్మంకు తరలిపోతున్నాయని, నల్లగొండకు రావడం లేదని దుయ్యబట్టారు.

సంస్కారహీన మాటలు: రవీంద్రనాయక్

కోమటిరెడ్డి సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ విమర్శించారు. మూసీ పునరుజ్జీవానికి బీజం వేసిందే కేసీఆర్ అని, రూ.16 వేల కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం డీపీఆర్ రెడీ చేసిందని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్లకు ఎందుకు పెంచిందని నిలదీశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టుల పనులను 90% పూర్తి చేశామని చెప్పారు.

సీఎం, మంత్రులది తిట్లదండకం: చిరుమర్తి

చంద్రబాబు సూచనలతోనే రేవంత్‌రెడ్డి మూసీ అంచనాలు పెంచారని, ప్రపంచ బ్యాంకు నుంచి అప్పులు తెచ్చి వాటిని ప్రజల నెత్తిన రుద్దాలని చూస్తున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మండిపడ్డారు. జిల్లా నుంచి ఇద్దరు మంత్రులున్నా చెరువులను ఎందుకు నింపడం లేదని నిలదీశారు. సీఎం, మంత్రులు సెక్యూరిటీ లేకుండా ప్రజల్లోకి వస్తే తరిమికొట్టే పరిస్థితి వచ్చిందని అన్నారు. రెఫరెండం పెట్టి ఎన్నికలకు వెళ్లే సత్తా కాంగ్రెస్‌కు ఉన్నదా? అని నిలదీశారు.

కోమటిరెడ్డి భాష మార్చుకో: పైళ్ల

మంత్రి కోమటిరెడ్డి జిల్లా ప్రజల్లో విషం నింపే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన తన భాష మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చెప్పారు. మూసీ పునరు